# అభిశప్తులు

చీకటి పడింది. వర్షం తగ్గకపోయినా ఇంకా ముసురుగానే ఉంది. చినుకులు పడుతూనే ఉన్నాయి, సముద్రం మీదినుంచి లేచిన తేమగాలులు తెరలు తెరలుగా వీస్తున్నాయి.

రామారావు వరండాలో కుర్చీలో కూర్చొని పరధ్యానంగా శూన్యంలోకి చూస్తూ సిగరెట్టు మీద సిగరెట్టు కాలుస్తున్నాడు. వరండాలో వేలాడుతున్న బల్బు సిగరెట్టు పొగలో మసక మసకగా నిర్జీవంగా వెలుగుతున్నట్లుంది. ఆ మసకకాంతిలో, ఉప్పు గాలికి ఒరిసిపోయి పెల్లలు ఊడిపోయిన గోడలు మరింత దయనీయంగా కనిపిస్తున్నాయి.

చలిచలిగా కూడా ఉంది.

రివ్వున గాలి తెర వీచింది – కిటికీ భళ్ళున తెరుచుకొని తుప్పుపట్టి ఒరిసిపోయిన బందులతో పెనుగులాడుతూ కీచు పెడుతూ కొట్టుకొంటోంది.

ఆ శబ్దానికి రామారావు ఉలిక్కిపడి పిచ్చిగా కొట్టుకొంటున్న కిటికీ వైపు చూశాడు. తన హృదయ కవాటాలు కూడా భయంకరమైన ఆలోచనల ఊపుకి అస్తవ్యస్తంగా కొట్టుకొంటూ క్షణంసేపు లయతప్పినట్టు అనిపించింది. తమాయించుకొని; భారంగా, ఊగుతున్న కిటికీ దగ్గరకు నడిచాడు. కిటికీ రెక్కని అదిమిపట్టుకొని బయటకు చూశాడు.

చెట్లలోనుంచి గాలి ఊళలు వేస్తూ పిచ్చిగా వీస్తోంది.

నిర్మానుష్యంగాఉన్న బీచ్‌రోడ్డుమీద కారు దూసుకుపోతోంది. దాని హెడ్‌లైట్ కాంతిలో గాలికి చినుకులు, ఆకులు గజిబిజిగా కొట్టుకొంటున్నాయి.

అంతవరకు నిశ్శబ్దంగా ఉన్న పక్క గదిలోనుంచి ఒక స్త్రీ బాధగా అరిచిన గావుకేకలు బయట హోరుని చీల్చుకొంటూ గాలిలో తేలిపోతూ క్రిందివాటాలో ఉన్నవాళ్ళకి కూడా వినిపించాయి. రానురాను అరిచే ఓపిక కూడా తగ్గిపోతున్నట్లు ఆ కేకలు నీరసించిపోతూ బెక్కులతోనూ, మూల్గులతోనూ చీకట్లో కరిగిపోయాయి.

క్రిందింటివారు ఆ కేకలకు క్షణం సేపు కదిలిపోయినా, రెండు మూడు నెలల్నుంచీ ఆ అరుపులు వింటూండటం వల్ల జాలిగా పెదవి విరిచి ఊరుకున్నారు.

''డాక్టర్ చెప్పాడు మరో వారం పది రోజులకు మించి బ్రతకదని. నిన్నటినుంచీ మరీ బాధపడి పోతోంది – మంచి వయస్సులోనే కేన్సర్ రావాలా? – పాపం వారం రోజులనుంచి రామారావు ఏమిటి తింటున్నాడో ఏమిటో! – కంటికి కునుకులేదు – భార్యకి నానా సేవలు చేస్తున్నాడు. ఎవరితోనూ మాట్లాడడు. తలరాత !'' అని క్రింది వాటాలో బెంగాలీ బాబు తన భార్యకు చెప్తూ, మనస్సులో ఉబుకుతున్న దిగుల్ని బలవంతంగా తమాయించుకొంటూ మంచంమీద టేప్‌రికార్డర్ ఆన్ చేశాడు.

గొంతుక సగం కోసి విడిచి పెట్టేసిన గొడ్డులా అటు ప్రాణంపోక, ఇటు బ్రతికే అవకాశం లేక తన్నుకుంటూ అరుస్తున్నట్లున్నాయి శాంత అరుపులు,. రామారావు గుమ్మం దగ్గర నిలబడి గది లోకి చూశాడు. గది చీకటిగా ఉన్నా వరండాలో బల్బుకాంతి మంచంమీద పడుతోంది. ఆ మసగ

కాంతిలో శాంత బట్టలు చుట్టి పడుకోబెట్టిన తాటాకు బొమ్మలా మంచానికి అతుక్కుపోయి లీలగా కనిపిస్తోంది. టేబిల్ మీద రకరకాల మందు సీసాలు – దూది – ఇంజక్షన్ సిరెంజి...

రామారావు చెవులు నిక్కించి ఆలకించాడు. స్పష్టాస్పష్టంగా ఊపిరాడుతున్నట్లు వినిపించింది. మధ్యలో గట్టిగా ఊపిరి తీసుకొనే ప్రయత్నంలో శాంత గుండెలు రెండుసార్లు ఎగిరిపడ్డాయి – మెల్లగా కదిలి మూలిగింది.

రామారావు నిట్టూర్చి గుండెలనిండా గాలి నింపుకొని జేబులో నుంచి సిగరెట్టు తీసి వెలిగించాడు. అగ్గిపుల్ల వెలుగు నిద్రలేక జేవురించిన అతని కళ్లలోనూ, అలసటతో బిరుసుబారిన ముఖ చర్మం మీదా క్షణం సేపు ఈదులాడింది.

''నిద్రపోలేదా?''...ఎక్కడో నూతిలోనించి వస్తున్నట్లు శాంత గొంతు. గుమ్మం దగ్గర వెలుగుకి అడ్డంగా నిల్చున్న రామారావు శాంత కళ్ళకి నీడలా స్పష్టాస్పష్టంగా కనిపిస్తున్నాడు.

''కళ్ళు మూసుకొని పడుకో.... నిద్ర పట్టేస్తుంది''.

''......గొంతులో బాధ.... భరించలేను.... చంపెయ్యండి ... మీకు పుణ్యముంటుంది.'' లేని సత్తువ తెచ్చుకొని దూరంగా నిల్చున్న రామారావుకి వినపడేటట్టు బాధతో పూడ్చుకుపోతున్న గొంతులోనించి పీంఢ్రించుకొని అరిచింది. ఆ అరుపుకి ఒక్కసారి రామారావు మనసు అద్దంలా చిట్లిపోయింది.

'' శాంతా'' అని గట్టిగా అరుచుకొంటూ విసురుగా గదిలోకి వెళ్లిశాంత దగ్గర నిల్చొని ఉద్వేగంతో వణికిపోతూ '' ఏమిటా మాటలు! నీ మాటల్తో నన్నెందుకిలా చంపేస్తావ్?'' అని కస్సుమన్నాడు.

శాంత ఏడుస్తోంది.

'' నా బాధ....'' అని చెప్పబోతున్న శాంత చేతుల్ని తన చేతుల్లోకి తీసుకొని మంచంమీద కూర్చున్నాడు. చర్మం తొడిగిన అస్థిపంజరం చేతుల్లా ఉన్నాయి శాంత చేతులు. ''ఏడవకు. మరీ బాధ ఎక్కువై పోతుంది – ''నిద్రపో. తరవాత మత్తు ఇంజక్షను ఇస్తాను నిద్ర పట్టేస్తుంది'' అని దుప్పటి కప్పి చెమర్చిన కళ్ళతో శూన్యంలోకి చూస్తూ శాంతని జోకొడ్తున్నాడు. అంత బాధలోనూ శాంత మనస్సులో సిగ్గుతో నవ్వుకొంటూ నిద్రలోకి జారుకుంది.

రామారావు లేచి మళ్లీ సిగరెట్టు వెలిగించి కిటికీ దగ్గరకు వచ్చి బయటకు చూశాడు. గాలి ఉధృతమౌతోంది .

మేఘాలతో ఆకాశం బరువెక్కి సముద్రం మీదికి దిగిపోతున్నట్లుగా ఉంది.

ఒడ్డున విరుగుతున్న అలలు తెల్లగా, చీకటి సముద్రపు చీర అంచుల్లా కనిపిస్తున్నాయి.

కిటికీ మూసి లైటు ఆర్పేసి వాలు కుర్చీలో పడుకున్నాడు రామారావు. రోడ్డుమీద దీపం కాంతి కిటికీ అద్దంలోంచి వరండాలోకి పడుతోంది.

క్రింది వాటాలోనుంచి టేప్‌రికార్డర్ మీద బెంగాలీ పాట వినిపిస్తోంది – మిస్టిక్ సాంగ్. రామారావుకి భాష అర్ధంకాకపోయినా ఆ పాటలో ఏదో తాత్విక చింతన ఉందనిపిస్తోంది. బాధల్ని ఆనందంగాపాడుకుంటూ తంబూరామీటుకుంటూ గంతులేస్తున్న బైరాగి పాట–''నదీ... ఓ... సన్యాసి.'' ఆ పాట అలా ఆలకిస్తూనే మగతనిద్రలోకి జారుతున్న రామారావుకి తన చిన్ననాటి సంగతి ఓ జ్ఞాపకంగానో లేక కలలాగానో అస్పష్టంగా గుర్తుకొచ్చింది.

తన తండ్రి పెంచిన పెంపుడుకుక్క ''రాణి'' గుర్తుకొచ్చింది.

''ప్రిన్సెస్ ఆఫ్ ఫెమినైన్ గ్రేస్'' అని ఆ కుక్కని తన తండ్రి ఆ ఇంటికి వచ్చేపోయే వాళ్ళందరికీ పరిచయం చేసేవాడు. నిజంగా అంత హుందాగానూ, అందంగానూ ఉండేది. ఉన్నట్లుండి దానికి హఠాత్తుగా జబ్బుచేసింది. మూడు రోజుల తర్వాత పక్షవాతం వచ్చి వెనక్కాళ్ళు రెండూ పడిపోయాయి. తన తండ్రి డబ్బును మంచినీళ్లగా ఖర్చుపెట్టి వైద్యం చెయ్యించాడు. రోజు రోజుకూ చిక్కిపోయింది. తన తండ్రిని చూసినప్పుడల్లా వెనక్కాళ్ళతో దేకుకుంటూ వెళ్ళి, కాళ్ళు నాకుతూ తోకాడించుకుంటూ, ముందరి కాళ్ళతో గీకేది.

''చూడండీ! ఈ జబ్బు ఇక నయం కాదు. అట్టేకాలం కూడా బ్రతకదు.... పాపం ! మీరు ఎంత ప్రేమతోనో పెంచారు. ఇట్ విల్ బి ఎ మిజరబుల్ డెత్ .... మీరు మరోలా అనుకోకపోతే ఇటీజ్ బెటర్ టు కిలిట్ అండ్ పుటెనెంట్ టు ఇట్స్ మిజరీ మీకు అభ్యంతరం లేకపోతే రేపు ఉదయాన్నే హాస్పిటల్‌కి పంపించండి – మెర్సీ కిలింగ్. ఏబ్సల్యూట్లీ పేన్‌లెస్ అని వెటర్నరీ డాక్టరు ఓదార్పుగా భుజంతట్టి వెళ్ళిపోయాడు.

మరుసటిరోజు ''రాణి''ని హాస్పిటల్‌కు తీసుకు వెళ్ళలేదు. తన తండ్రి రాణిని ఎత్తుకొని పెరట్లోకి తీసుకువెళ్ళాడు. చేతిలో తుపాకీ ఉంది. ముద్దాడి క్రిందికి దించాడు. రాణి దేకుకుంటూ మారాం చేస్తూ ముద్దుగాఅరుస్తోంది. నాలుగు అడుగులు వెనక్కివేశాడు. తుపాకీఎత్తి గురిచూశాడు. చేతులు వణుకుతున్నాయి. గురి ఆనడం లేదు.

''ధన్'' – చెట్లమీద కాకులు అరుచుకుంటూ గుప్పున ఎగిరిపోయాయి. గురితప్పిన గుండు క్రిందభూమిని దొలిచేస్తూ రాణిని ఎత్తి అవతల పారేసింది. కుయ్యోమని గాలిలో అరుచుకుంటూ వెల్లకిల పడిపోయింది.

మలేరియా జ్వరం వచ్చినవాడిలా అపాదమస్తకం కంపించి పోతున్నాడు. చేతిలో తుపాకీ ఊగిపోతోంది.

''ధన్'' – మరోషాట్. గుండెల్లో దూసుకుపోయింది. పడిపోయి లేవబోతోంది.

'' ధన్'' – ఈసారి గురి తప్పలేదు. గుండు తలలోంచి దూసుకుపోయింది. తల వాలిపోయింది. క్షణంసేపు కుక్క ఒళ్ళు గజగజ వణికి నిశ్చలం అయిపోయింది.

''నా చేతుల మీద పెంచిన కుక్కని, నేను ప్రేమతో పెంచిన కుక్కని, ప్రేమతో నేనే చంపేశాను'' అని చిన్నపిల్లాడిలా బావురుమంటూ తాగినవాడిలా తూలుకుంటూ చేతిలో తుపాకితో ఇంట్లోకి వెళ్ళిపోయిన తండ్రి జ్ఞాపకం వచ్చాడు.

తూట్లుపడిన రాణి శరీరంలోనుంచి ఎర్రటి నెత్తురు నెమ్మదిగా చిమ్ముతోంది.

'' ధన్ – ధన్ – ధన్ '' మూడు గన్ షాట్స్‌కి రామారావు ఉలిక్కిపడి లేచాడు.

గాలికి కిటికీ రెక్క కటకటమంటూ మెల్లగా తెరుచుకొంది. రోడ్డు దీపపు కాంతి, గాలితోపాటు తోసుకువచ్చినట్లు వరండాగోడమీద ఊచల కిటికీ నీడకూడా పడింది. రామారావు పరధ్యానంగా వరండాలో కుర్చీలో కూర్చున్నాడు. లైట్ హౌసు కాంతి ఉండుండి కిటికీలోంచి మెరుపులా అతని మీదినుంచి దాటుకుంటూ సముద్రంమీద పరుచుకున్న చీకట్లని చీల్చుకుంటూ చరాలున మాయమౌతోంది. అలా కాంతి పడినప్పుడల్లా రామారావు నీడ కిటికీ నీడతో కలిసి గోడమీద చిక్క

బడుతూ మెరుస్తోంది.

ప్రక్క గదిలోనుంచి మళ్ళీ శాంత గావుకేక. రామారావు లేచి గంభీరంగా నిల్చున్నాడు. కఠిన శిలను తాకి పరావర్తనమైనట్లు ఆ ఆర్తనాద తరంగాలు రామారావు హృదయాన్ని చొచ్చుకోలేక, మెత్తబడి క్షీణించిపోతూ గాలి హోరులో కలిసిపోయాయి.

రామారావు శాంతగదిలోకి ప్రవేశించి లైటు వేశాడు. మెలికలు తిరిగిపోతోందిశాంత. డ్రాయరు తీసి సీసాలోని మందు (పెన్సిలిన్) సిరింజిలోకి ఎక్కించాడు.

శాంత భుజం కదిపింది ఇంజక్షన్ కోసం.

'' ఇంట్రావీనస్ ఇచ్చేస్తాను.... తొందరగా నిద్రపోదువుగాని!'' ఎడంచేత్తో శాంత చేతిని బిగబట్టి వెయిన్ కోసం వెతికాడు. బల్బుకాంతిలో వెయిన్ నల్లటి చారలా ఉబికింది. రామారావు తడబడుతున్నాడు. సిరింజి కదిలిపోతోంది. అంత చలిలోనూ రామారావుకి చెమట్లు పడుతున్నట్లనిపించింది. నరంలోకి సూది గుచ్చాడు. కదిలిపోయి మిస్ అయిపోయింది. శాంత సన్నగా మూలిగింది. సిరింజి వెనక్కి లాగి మళ్లీ గుచ్చి సూదిపైకి లాగి ఈసారి శాంత దండని మరింత గట్టిగా అదిమిపట్టి మరో వెయిన్‌లో గుచ్చాడు. రక్తపుచార నల్లగా సిరంజిలోకి వచ్చి మందుతో కలిసిపోయింది. వెయిన్ దొరికింది. మెల్లగా మందు ఎక్కిస్తున్నాడు. శాంతలోకి మందు ఎక్కిస్తున్నప్పుడు అతని శరీరంలో రక్తం వేడెక్కుతూ, నరాల్లోనుంచి తోసుకుంటూ, ఒరుసుకుంటూ పోతున్నట్లు ఒళ్ళంతా కంపించిపోతోంది. కళ్ళు అగ్నిగోళాల్లా ఎరుపెక్కి ఉబ్బిపోయి పేలిపోయేటట్లుగా ఉన్నాయి.

మందెక్కించి, సిరింజితీసి బల్లమీదపెట్టి, ఎగిరిపడుతున్న గుండెలతో శాంత ఎదురుగా నిల్చున్నాడు. ఇంజక్షన్ మందు నరాల్లో నించి చలిలా పాకురుకుంటూ శాంత ఆపాదమస్తకం విస్తరించుకొంటోంది. క్షణంసేపు వళ్ళంతా గజిబిజిగా వణికింది. అంతకుముందులా మందు మత్తు కలిగించటంలేదు. శాంతకి ఏదోలా అయిపోతున్నట్లనిపించింది. ఊపిరి బరువెక్కుతోంది. శరీరంనుంచి స్పర్శజ్ఞానం విడిపోతున్నటుంది. అంతవరకు పేలవంగా వున్న కళ్ళు అసాధారణ పరిమాణంలో విచ్చుకున్నాయి. చూపు నిలకడలేని కంటిపాపలు కంగారుగా కదులుతున్నాయి.

గదిలో లైటుకాంతి చూస్తుండగానే కరిగిపోయి ఆవిరి అలలుగా గదంతా అలుముకుంటున్నట్లు వక్రీభవిస్తున్న శాంత చూపులకి కనిపిస్తున్నాయి. ఆ అలల మధ్య ఎదురుగాఉన్న రామారావు ఆకారం ఊగుతున్నట్లుంది. అలా ఊగుతున్న ఆకారం, గాజుపెంకు చిట్లినట్లు చిట్లిపోయి ముక్క ముక్కలుగా విడిపోయి గదిలో అలలమీద తేలుతోంది.

ఎగూపిరితో ఎగసిపడుతున్న శాంత గుండెలు క్రమంగా రబ్బరు బుంగలోంచి గాలి పోతున్నట్లు నెమ్మదిస్తున్నాయి. మెల్లగా మంచు సముద్రంలోకి దిగిపోతున్నట్లుంది. కంటిపాపల కదలికలు కూడా ఆగిపోతున్నాయి. ఉన్నట్లుండి శాంత ఒక్కసారి పెద్దగా ఊపిరి పీలుస్తూ ఇంతెత్తున మంచం మీద ఎగిరిపడింది. ఆ కదలికకి క్షణంసేపు శాంత దృష్టి కేంద్రీకృతమైంది. అలలు కరిగిపోయి తిరిగి గదిలో వెలుగు స్పష్టంగా కనిపిస్తోంది. చిట్లిపోయిన రామారావు ఆకారం మొదట్లో దూరంగా ఉన్నట్లు అస్పష్టంగా కనిపించి, స్పష్టాస్పష్టంగా దగ్గరౌతూ, రానురాను ఆకారాన్ని పుంజుకొంటూ శాంత చూపులో ప్రస్ఫుటంగా రామారావు కనిపించాడు. తన కళ్ళలోకి చూస్తున్నాడు. చూపు

మందగిస్తున్న శాంత కళ్ళు కృతజ్ఞతతో రామారావు వైపు చూస్తూనే ఘనీభవించిపోయాయి – చీకటి ...

బయట కుక్క హోరుగాలిలో ఏడుస్తున్నట్లు అరుస్తోంది.

అలా నిర్జీవంగా నిలిచిపోయిన శాంత కళ్ళలోకి చూడలేక రామారావు లైటు ఆర్పేశాడు. పాపంతో తడిసిన చీకట్లోనుంచి తడబడిపోతూ తూలుకుంటూ వరండాలోకి విసురుగా వచ్చి కంగారుగా వెతుక్కుంటూ స్విచ్ వేశాడు. జిగ్‌మని ముఖానికి కొట్టిన వెలుగుకి చేతులు అడ్డం పెట్టుకుంటూ నెర్వస్‌గా రొప్పుతున్నాడు.

గాలిహోరులో ఉరుములు...

సముద్రం ఘోషిస్తోంది.

కుక్క ఇంకా అరుస్తూనే ఉంది.

ఝుంఝూమారుతంలా కిటికీలోనించి దూసుకు వచ్చిన గాలి తాకిడికి వరండా ఊగిపోతున్నట్లుంది. వరండాలో వేలాడుతున్న బల్బు గాలికి అస్తవ్యస్తంగా ఊగుతూ గిరగిరా తిరుగుతోంది. ఆ కాంతిలో ఒగురుస్తున్న రామారావు నీడ గోడమీద పరుగెత్తుతోంది. పెద్దదౌతూ దూరమౌతూ, దగ్గరౌతూ, చిక్కిపోతూ, భూతంలా అమాంతంగా పెరిగిపోతూ, రామారావు నీడలు ఊగుతున్న బల్బు కాంతిలో వికృతంగా గోడలమీద ఆడుతున్నాయి. రామారావుకి తన నీడే భయంకరంగా వెంటాడుతున్నట్లు, భూమంతా ఆవహిస్తున్నట్లు కనిపిస్తోంది – తల తిరిగిపోతోంది – బయట పెద్ద పిడుగు – కరెంటు కట్ అయిపోయింది – అంతా చీకటి. ఆ చీకటిలో కుప్పలా కూలిపోతూ రామారావు గావుకేక పెట్టాడు.

మరుసటి రోజు చుట్టుప్రక్కలవాళ్ళూ, స్నేహితులూ వచ్చి రామారావుని పరామర్శిస్తున్నారు. శాంతని ట్రీట్ చేసిన డాక్టరుకూడా వచ్చి సానుభూతి తెలియజేస్తూ '' దిగులు పడకండి. మీరు చేయగలిగిందంతా చేశారు – మీరు మరోలా అనుకోకండి – త్వరగా పోయి బాధనుంచి విముక్తయిపోయింది. ఎలానూ పోవడం ఖాయం. మీరు ధైర్యంగా ఉండండి'' అని స్థాణువుగా శాంత దగ్గర నిల్చున్న రామారావుని ఓదార్చి వెళ్ళిపోయాడు. శాంత ముఖంమీద ఈగవాలి అచేతనంగా నిలిచిపోయున్న కళ్ళమీద నుంచి పాకురుకుంటూ పెదాలదగ్గరకు వచ్చి ఎగిరిపోయింది. ఆ కళ్ళు రామారావునే చూస్తున్నట్లుగా ఉన్నాయి. దుప్పటి కప్పేశాడు.

దహనక్రియలు జరిగిపోయాయి.

శాంత అస్థికల్ని గంగలో కలపడానికి రామారావు కాశీ బయలుదేరాడు.

స్టేషన్‌లో; క్రింది వాటాలో ఉన్న బెంగాలీబాబు కాశీలో వెంబడించే పండాలగురించి, బసచేసే సత్రాల గురించి అన్ని జాగ్రత్తలనూ వివరంగా చెబుతున్నాడు. రామారావు ఎవరికో చెబుతున్నట్లు వింటున్నాడు. సిగరెట్ కాల్చుకుంటూ టీవీ మీద అడ్వర్టయిజమెంట్లు చూస్తున్నాడు. బండి రాగానే జాగాచేసి కూర్చోబెట్టాడు రామారావుని బెంగాలీబాబు. బండి కదిలింది. బెంగాలీబాబు చెయ్యి ఊపుతున్నా అది గమనించని రామారావు పరధ్యానంగా మాసిన గడ్డాన్ని తడుముకుంటూ వెంట్రుకల్ని వెతికి వెతికి పీక్కుంటూ దూరమైపోతున్న ప్లాట్‌ఫారం మీద జనాన్ని శూన్యంలోకి చూస్తున్నట్లు కిటికీలోంచి చూస్తున్నాడు.

''భొ(ద్రాలోక్ - పాగల్ హాయ్ గచ్చే'' (ఈ పెద్ద మనిషికి పిచ్చెక్కినట్టుంది) అని జాలిగా నిట్టూరుస్తూ రైలుబండిని కనుచూపుమేర దాటేవరకూ చూస్తూ ప్లాట్‌ఫారం మీద నిల్చున్నాడు బెంగాలీ స్నేహితుడు.

★ ★ ★

గంగా తీరం -

నదిమీద పొగమంచు లేస్తోంది. తూర్పున ఆకాశంమీద వెలుగు పొడకడుతోంది. మసగ చీకటిలో నదిమీద అక్కడక్కడ లాంతర్లు మిణుకుమిణుకుమంటున్నాయి.

రామారావు స్నానఘట్టాల మెట్లమీద కూర్చొని రాత్రంతా ప్రయాణంచేసి అలసిపోయిన కళ్ళతో గంగను చూస్తున్నాడు.

పొగమంచు నదిమీద కమ్ముకుంటూ పాయలుగా విడిపోతూ నీటి పావంచాల మీదనుంచి పాకురుకుంటూ కదిలిపోతోంది.

గంగ, శివజటాజూటం నుంచి ఉత్తుంగ తరంగంలా ఉరుకుతున్నట్లుగా ప్రవహించటం లేదు. పాపాలని ప్రక్షాళనం చేస్తూ మోక్షదాయినిగా పేరెన్నికగన్న నదీమతల్లిగా నిండుగా, గంభీరంగా విశ్వేశ్వరాలయ ఘంటారావాలకు పరవశించి పోతున్నట్లుగా ప్రవహిస్తోంది. అప్పటికే భక్తులు స్నానఘట్టాలకి, స్నానాలకి చేరుకుంటున్నారు. ''హరహర మహాదేవ్'' అంటూ శివనామస్మరణ చేస్తూ నిల్చొని దోసిళ్ళలో నీళ్ళు తర్పణంగా విడుస్తున్నారు. ఉషఃకాంతి నదిమీద నీళ్ళలో కరిగిన బంగారం కాంతిలా ప్రతిఫలిస్తోంది. పొగమంచు కరిగిపోతోంది.

''రామ్‌నామ్ సత్‌హై.... రామ్‌నామ్ సత్‌హై. ....'' అనుకుంటూ పాడె కట్టిన శవాన్ని మోసుకుపోతున్నారు. రామారావు ఆ శవాన్ని కనుచూపు మేరవరకూ అలా చూస్తూ ఉండిపోయాడు. రామారావు గుండెల్లో శాంత మెదిలింది. మనస్సు ఉప్పెనలాగా లేచిన అవ్యక్త సంక్షోభంతో కొట్టుకొంటోంది. శాంత శవం కళ్ళకు కట్టినట్లు కనిపిస్తోంది. నిర్జీవంగా నిలిచిపోయిన శాంత కళ్ళు.

రామారావు చలిలో గజగజ వణికాడు.

రాను రాను స్నానఘట్టాలు జనసందోహంతో నిండి పోతున్నాయి. ఆకు గొడుగుల దుకాణాల్ని తెరుస్తున్నారు. అమ్మకానికి కాయలు, పళ్ళు, పూలు, పూజా సామాగ్రి బడ్డీలమీద సర్దుతున్నారు. పండాలు స్నానాలు చేసి, పిండికట్లూ తిరుచూర్ణాలూ దిద్దుకొని తమ తమ స్థానాల్లో కూర్చొని బేరాలకోసం ఎదురు చూస్తున్నారు.

మణికర్ణికా ఘాట్‌లోనుంచి శవధూమం లేచింది. రాబందు రెక్కలు కొట్టుకొంటూ అటువైపు ఎగురుతూ వెళ్ళింది.

భజనలు, గుడిగంటలు, సంకీర్తన మేళాలతో ఆ ప్రాంతమంతా హోరెత్తిపోతోంది.

'' మీరు తెలుగువారా? '' వెనకనించి పండా పలకరించాడు.

''అవును'' అని లేచి సర్దుకొని నిలుచున్నాడు రామారావు.

అరవవేషంలో... తెలుగువచ్చిన బీహార్‌పండా. విభూతిరేఖలు నుదిటిమీద ఒత్తుగా దిద్దుకొని, తెల్ల లుంగిని వెడల్పాటి తోలు పటకాతో బిగించుకొని, జరదాకిళ్ళీ నములుకొంటూ, నోట్లో నిండిన

ఉమ్మని పెదాలలో బిగించి అదిమిపడ్తూ రామారావు కళ్ళలోకి చూశాడు.

'' నాభార్య అస్తికల్ని కలపడానికి వచ్చాను.... మాది విశాఖపట్నం..... మీరు?''

కిళ్ళీ ఉమ్మని బొళ్ళున ఉమ్మి '' విశాఖ జిల్లానుంచి వచ్చిన వాళ్ళందరూ మన దగ్గరకే వస్తారు. ఉత్తరం రాస్తే మనమే స్టేషన్‌కి వచ్చి ఉండేవాళ్ళం. బసా అదీ ఏర్పాటుచేసి సాదాసీదాగా పనిచేస్తాం'' అని రకరకాల పేర్లు చెప్పి వాళ్ళు మీకు తెలుసా అన్నాడు. రామారావు తెలీదన్నాడు. ''పైసా పాపి. మీది ఇష్టం ఉంటే ఇవ్వండి. లేకపోతే మనం ఫ్రీగా చేస్తాం'' అని భరోసా ఇస్తున్నట్లు గుండెలమీద చెయ్యివేసుకొని మరీ చెప్పాడు ''పిండప్రదానం కూడా చేస్తారా?''

'' ఎంతవుతుంది?'' సాలోచనగా అడిగాడు రామారావు.

పండా ఖస్సుమని లేచాడు '' ఇది ధర్మేంద్ర, హేమమాలిని సినిమా టికెట్లు కాదు. మీ తండ్రి గార్లకి, మీ తల్లులగార్కి, మీ భార్యలుగార్కి పుణ్యలోకానికి పంపడానికి ఇక్కడికి వచ్చార్. మీది పుణ్యం, మీ పిల్లలదీ పుణ్యం '' పుణ్యానికి టికెట్టు లేదు'' అని వేదాంతిలా కనుబొమలెగరేస్తూ చేతులు తిప్పుతూ చెప్పాడు. ''మీదీ ఇష్టం!. మీదీ ఇష్టమే - మా దీ ఇష్టం. పూజాదినుసులకి ఏభైరూపాయలు.''

రామారావు వందరూపాయల నోటు తీసి ఇచ్చాడు.

'' ఇక్కడే కూర్చోండి. తప్పిపోతార్. దినుసులు తెస్తాన్. మీదీ భయం వద్దు. నేను పారిపోను'' అని వెళిపోయాడు.

అరగంటలో పూజాసామాగ్రి కొనుక్కొని తిరిగి వచ్చాడు.

''స్నానం చేసిరండి'' - అంటూ పూజ సామాగ్రిని గట్టుమీద సర్దుతున్నాడు. రామారావు సంచీ పండా దగ్గర విడిచిపెట్టి గంగలో మునుగుతున్నాడు. అలా మునుగుతున్నంత సేపూ సామాన్లని పేరుస్తూ మధ్యమధ్య రామారావుని చూస్తూ మంత్రాలు ఉచ్చరిస్తూ ''మరోసార్ మునగాలి - ఇంకోసార్ - పితృ దేవతల్‌ను ధ్యానం చేస్తూ మరోసార్ మునగాలి.... తడిబట్టల్‌తో రండి.'' రామారావు తడిబట్టల్‌తో నిళ్ళోడుతూ పండాముందు కూర్చున్నాడు. ముక్కంట నీరు కారుతోంది. పండా బొట్టు పెట్టాడు. మంత్రాలు మొదలు పెట్టాడు. ఒక్కోసారి గంభీరంగానూ, మరోసారి నీరసంగానూ రకరకాల గొంతులతో మధ్యలో తాళీకొడ్తూ తంతు జరిపిస్తున్నాడు.

'' అస్తికల పిడత ఎక్కడ?''

రామారావుతో సంచిలోనుంచి అస్తికల డబ్బా తీయించి, చితాభస్మావశేషాన్ని పిండాలమధ్య పెట్టించి, ఒక్కోసారి ముక్కుపట్టుకుంటూ, గంగవైపు చూస్తూ ఆకాశంవైపు కనుబొమలెగరేస్తూ తీక్షణంగా చూస్తూ తొందర తొందరగా గుక్క మారుస్తూ ఊపిరి ఎగబీల్చుకుంటూ ఫెళఫెళమని మంత్రాల్ని వల్లిస్తున్నాడు. రామారావుకి అవేవీ అర్థంకాక అయోమయంగా పండా చెప్పినట్లు యాంత్రికంగా చేస్తున్నాడు. అలా ఏమరుపాటుగా ఉంటున్న రామారావుని మంత్రాలమధ్యలో గసురుతూ మందలిస్తున్నాడు.

రామారావు పిండప్రదానం చేసి, గంగలో అస్తి నిమజ్జనం చేసి తర్పణం విడిచాడు. కాకులు ఎగబడుతున్నాయి.

'' బస్! అయిపోయింది. మీది పిత్రుదేవతల్కి మహానందం చేశావ్ - మరీ మనది దక్షిణ''

అని డిమాండ్‌గా నిల్చున్నాడు-'' ఇదిగో మీది మిగిలిన పైసా'' అని ఏభై రూపాయిలు ఇవ్వ బోయాడు. 'అది ఉంచుకోండి- అంతకంటే ఎక్కువ ఇచ్చుకోలేను''

'' ఊ! ...'' అని ఆలోచనగా తలమీది కెత్తి జర్దాకిళ్లీ పళ్ళలోనుంచి చూస్తున్నట్లు రామారావుని ఎగాదిగా చూసి, పెదాలమీద ఉమ్మును తుడుచుకుంటూ '' అచ్ఛా! ... జీతేరహో బేటా... ''మనదీ పేరు మీది ఊళ్ళువాళ్ళకి చెప్పు '' అని ఇంగ్లీషు, తెలుగు అరవం, కన్నడం, భాషల్లో రాసిన తన ఎడ్రసు కార్డు ఇచ్చి సెలవు తీసుకు వెళిపోబోతున్న పండాని ఆత్రుతగా ''మరి ప్రాయశ్చితం చెయ్యం చరూ.....?''

'' దేనికి?.........మంచిది - మనిషి తెలిసికొన్ని, తెలియక కొన్ని పాపాలు చేస్తుంటార్. అచ్ఛా; జాంతే బేటా, జాంతే - మరోసారి గంగలో మునుగు; మనం ప్రాయశ్చిత్తం చేయిస్తాం'' అలా గంగలో మునుగుతున్న రామారావుతో గురుద్రోహానికి , మానసిక వ్యభిచారానికి, బ్రాహ్మణహత్య, గోహత్య, పితృహత్య మొదలగు రకరకాల హత్యలకు ప్రాయశ్చిత్తం చెప్పించాడు - రామారావుకి విశాఖపట్నం, సముద్రతీరం-శాంత-కేన్సరు - తుఫాను - ఇంజక్షన్... శాంతహత్య- ప్రాయశ్చిత్తం - కళ్ళు చీకట్లు కమ్ముతున్నాయి. నదీ గర్భంలో కొట్టుకుపోతున్నట్లనిపించింది. తమాయించుకొని కళ్ళు తెరిచి చూసేసరికి పండా చెయ్యూపుతూ మెట్లెక్కుతూ జనంలో కలసిపోయాడు.

రామారావు బట్టలు మార్చుకున్నాడు. గౌరంగ భక్తులు తాళాలు వాయించుకుంటూ మృదం గాల మేళవింపుతో తారాస్థాయిలో లయబద్ధంగా ఊగుకుంటూ వలయాకారంగా తిరుగు తున్నారు. ఆ గంతులకి వాళ్ళ జులపాల జుత్తులు ఎగురుతున్నాయి. ఆడవాళ్ళు స్నానాలు చేసి తడిబట్టలతో గంగ ఉదకాన్ని రాగి చెంబుల్లోకి పట్టి విశ్వేశ్వరాలయానికి వెళ్తున్నారు

మధ్యాహ్నం కావస్తోంది. ఎండ తీవ్రంగా లేదు. రామారావుకి ఆకలి రేగిపోతోంది. దుకాణం దగ్గర కాజాలు, సమోసాలు కొనుక్కుని తిని గబగబా రెండు గ్లాసుల నీళ్ళు తాగి టీకి ఆర్డరిచ్చాడు. ప్రక్క దుకాణంలో సిగరెట్లు కొనుక్కొని వెలిగించాడు. ఏ పని చేసినా శాంత జ్ఞాపకం వస్తోంది - టీ దుకాణం వాడు చాయ్ తొరుపుతున్నాడు. శాంతకి టీ అంటే చాలా ఇష్టం. తొరుపుతున్న టీలో నుంచి లేచిన ఆవిర్లను రెస్ట్‌లెస్‌గా చూస్తున్నాడు.

'' దోచాయ్... బ్లాక్ టీ'' - తన హిందీకి తనే నవ్వుకుంటూ కొంటెగా పక్కనున్న దొరవైపు చూసి గిగిలించింది - హిప్పీలు.

మగవాడికి అండర్‌వేర్ తప్ప ఒంటి మీద బట్టలేదు. సన్నగా రివటలా పొడువుగా ఉన్నాడు. మాసిన గడ్డం, మెడమీదికి వేలాడుతున్న రాగిజుత్తు. కళ్ళు నీలంగా మత్తుగా ఉన్నాయి. ఎక్కడో దొర్లినట్లు ఒంటినిండా ఇసక. మొలలో మౌత్ ఆర్గన్ దోపుకొన్నాడు.

హిప్పీ అమ్మాయి మాసిపోయి చిరిగిపోయిన గౌను తొడుక్కొనుంది. ఎర్రటి జుత్తుని పిలకల్లాగా జడేసుకొని పురికొసని రిబ్బనుగా బిగించింది. కాళ్ళకి జోళ్ళుగాని చెప్పులుగాని లేవు. ఎర్రటి ముఖం. ముఖం మీద చిన్న చిన్న గోధుమరంగు మచ్చలు, అమ్మాయే అయినా వయస్సు పొంకం గాని, శరీరం బింకంగాని ఏ కోశానా లేదు. అలా అని అందవికారంగా కూడా లేదు. పిల్లి కళ్ళలా పచ్చనికళ్ళు తీక్షణంగా ఉన్నాయి - పెదాలు పగుళ్ళు తేరి ఎర్రగా ఉన్నాయి నోట్లో బీడీ - వాళ్ల దగ్గరకు రాగానే రామారావుకి గబ్బుకంపు కొట్టింది - తడిసిపోయిన కుక్క వాసన.

రామారావు టీ అందుకున్నాడు. హిప్పీలు కూడా బ్లాక్ టీ తీసుకొని అక్కడే గట్టుమీద చతికిలబడి కూర్చున్నారు. ఎడమ చేత్తో బీడీ కాలుస్తూ హిప్పీ అమ్మాయి రామారావు వైపు పలకరింపుగా చూసి నవ్వింది. ఎర్రటి పెదాల మీది నుంచి నల్లటి టీ డికాషన్ బొట్లు గౌను మీదికి జారాయి. ఆ నవ్వు అడవి పువ్వులా స్వచ్ఛంగానూ అమాయకంగానూ ఉంది. రామారావు కూడా నవ్వి దూరంగా కూర్చుని టీ తాగుతున్నాడు.

మగ హిప్పీ సడన్‌గా మౌత్ ఆర్గన్ మీద గాలి దూసుకుపోతున్నట్లు ట్యూన్ కొట్టాడు. పూనకం వచ్చినట్లు తల ఆడించుకొంటూ తదేక దీక్షతో కళ్ళు మూసుకొని రీడ్స్ మీద పెదాలు నాట్యం చేస్తున్నట్లు మౌత్ ఆర్గన్ మీద పాశ్చాత్య సంగీతం అంచెలంచెలుగా స్వరారోహణ చేస్తూ వాయిస్తున్నాడు.

జనం వింతగా చూస్తూ పోతున్నారు. హిప్పీ అమ్మాయి బీడిని గట్టిగా దమ్ములాగుతూ అర్ధ నిమీలిత నేత్రాలతో మౌత్ ఆర్గన్ వింటోంది.

'' హరేక్రిష్ణ... హరేక్రిష్ణ హరేహరే'' అంటూ హరే క్రిష్ణ భక్తబృందం తాళాలు వాయించుకుంటూ వింజామరలు విసురుకుంటూ అప్పుడే స్నానం చేసి దుకాణం ముందునుండి వెళ్తున్నారు. ఆడామగా ఉన్నారు. హిందూ సాంప్రదాయ ప్రకారం పంచెలు, చీరలు కట్టుకొన్నారు. నున్నటి గుళ్ళతో, గులాబీ ఛాయ శరీరాలతో, యజ్ఞోపవీతాలు ధరించిన అమెరికన్ దొరలు; జడలలో తెల్లటి చీరలు ధరించి ఇరుకుగా నడుస్తూ విసనకర్రలు చేత బుచ్చుకొని నడుస్తున్న పాశ్చాత్య భక్తురాండ్రు క్రిష్ణనామ స్మరణ చేసుకుంటూ రాధామాధవుల తాత్విక పరిష్వంగాన్ని మననం చేసుకొంటూ నడుస్తున్నారు. అలా నడుస్తున్న రాధాక్రిష్ణ భక్తురాల్ని బ్లాక్ టీ తాగుతున్న హిప్పీ అమ్మాయి ''హై'' అని ఆప్యాయంగా పలకరించింది. ఆ అరుపులు విన్న భక్తురాలు వెనక్కి తిరిగి హిప్పీని చూస్తూ గొంగళిపురుగును చూస్తున్నట్లు అసహ్యించుకొంటూవిసనకర్రని మొహానికి అడ్డు పెట్టుకొంటూ '' రాధే! రాధే!'' అనుకుంటూ గబగబ భక్త బృందంలో కలిసిపోయింది. ఎంతో ప్రేమగా పలకరించినా ఆ భక్తురాలు అంత అసహ్యంగా మొహం చాటేసుకోవటాన్ని హిప్పీ అమ్మాయి భరించలేకపోయింది. రెచ్చగొట్టిన అడవి పిల్లిలా సర్రున లేచింది. కోపంతో రొప్పుతోంది.

'' యూ క్రేజీ కంట్....'' అంటూ భక్తురాల్ని పట్టుకోవడానికి పరుగెత్తబోయింది. మగ హిప్పీ పట్టుకొని సముదాయిస్తూ '' టేక్ ఇట్ ఈజీ.... లెట్స్ గో'' అని బుజ్జగిస్తున్నాడు. విదిలించుకోవడానికి ప్రయత్నిస్తూ '' హేయ్ స్లైమీ స్లట్! అని చేతులు చాచుకొంటూ కాళ్ళు బారగా ఎడమ చేసి జఘన భాగాన్ని అసభ్యంగా ముందుకీ వెనక్కి ఊపుకొంటూ అరుస్తోంది.

మగహిప్పీ అలా అరుస్తున్న ఆడహిప్పీని బలవంతంగా కూర్చోబెట్టాడు. ఇటూ అటూ చూసి భుజానికి వేలాడుతున్న సంచిలోంచి ఇంజక్షన్ సిరంజ్ తీశాడు. అందులో కొంచెం మందు ఉంది. ఆడ హిప్పీ దండకి గుచ్చాడు. ఆ అమ్మాయి బాగా అలవాటు పడిపోయినట్లుంది. ఏమీ చలించ లేదు.

హిప్పీ అలా ఇంజక్షన్ చేస్తుండడాన్ని ప్రక్కనే రామారావు బెదురుగా గిల్టీగా చూశాడు. అమ్మాయి అరుపులు తగ్గిపోయాయి. ఒగురుస్తూ తనలోతాను హిస్టీరిక్‌గా ఏడుస్తోంది ''ఎక్స్యూజ్

మీ'' అంటూ రామారావు ఆ అమ్మాయి ప్రక్కన కూర్చున్నాడు. కళ్ళు తుడుచు కొంటూ రామారావువైపు చూసింది. ఏదో శూన్యంలోకి చూస్తున్నట్లుంది. ఆ అమ్మాయిని చూస్తుంటే రామారావుకి ఎందుకోగాని అవ్యక్తమైన జాలి కలుగుతోంది. ఇంగ్లీషులో సంభాషణ మొదలు పెట్టాడు. మాటల సందర్భంలో ఆ అమ్మాయి హార్వర్డ్ యూనివర్శిటీలో చదివి మానేసిందని తెలిసింది. మనిషి స్వేచ్ఛపై సమాజపు సంకెళ్ళు, సాంఘిక నియంత్రణాలపై వాపోయింది. మనిషిలో, నాగరికత మేలిముసుగు చాటున పెరుగుతున్న హిపోక్రిసీ మీద అసహ్యంతో విరక్తితో విశృంఖలంగా తిరుగుతోంది.

ఇంతలో ఒక కుష్టురోగి గోనె గుడ్డని కప్పుకొని కుంటుకుంటూ వేళ్ళు లేని మొండి చేతుల్తో అడుక్కుంటూ ఎదురుగా నిల్చున్నాడు. అంతవరకు రామారావుతో మాట్లాడుతున్న హిప్పీ అమ్మాయి సంభాషణ మధ్యలో తుంచేసి గబగబ లేచి కుష్టురోగిని ఆప్యాయంగా చేతుల్తో పట్టుకొని దగ్గర కూర్చోబెట్టుకుంది.

అప్పటికే పేలికలుగా ఉన్న తన గౌనును చించి రసి కారుతున్న కుష్టురోగి కురుపులను తుడిచి కట్టుకడుతోంది. నీచు వాసన కొడుతోంది. రామారావుతో పాటు కుష్టురోగి కూడ తికమక పడిపోతున్నాడు. మగ హిప్పీ కూడా కుష్టురోగికి సంచిలో గుడ్డలు తీసి కట్లు కడుతున్నాడు.

''మనిషి'' కుళ్ళి కుళ్ళి ఇలా చావల్సిందేనా? మానవతా దృక్పథంతో సమాజమే ఈ మనిషిని చంపేసి ఎందుకు శాశ్వతంగా ఈ బాధలనుంచి విముక్తి చెయ్యకూడదు? 'యుతనే షియా'ని లీగలైజ్ చెయ్యాలి – యుద్ధంలో దేశం పేరిట, మాతృభూమి సంరక్షణ పేరిట, మతం పేరిట అర్థం లేని ఆవేశాన్ని రెచ్చగొట్టి మనిషిని మనిషి చంపే వ్యవస్థలో మనం ఉన్నాం. ఏమంటే ఇది వీరత్వం!! ఇదేమి న్యాయం అని కసిగా ఊగిపోతూ రోగంతో చావబోతున్న పిల్లల్ని చూసి విలపిస్తున్న తల్లిలా ఆ కుష్టురోగిని చూస్తూ భోరున ఏడ్చింది– తమాయించుకొని ముక్కు చీమిడి తుడుచుకొంటూ గౌను జేబులోనుండి వందరూపాయల నోటు తీసి ఆ కుష్టు రోగికి ఇచ్చింది. రామారావు కళ్ళు జిగ్గు మన్నాయి – అనుమానంగా వందరూపాయిలు తీసుకొని అయోమయంగా ముష్టివాడు కుంటు కుంటూ జనంలోకి వెళ్ళిపోయాడు.

గౌను జేబులోనుంచి రెండు సిగరెట్లు తీసి రామారావుకి ఇస్తూ '' టెన్ రూపీస్ ఈచ్, హేవ్ ఎనైస్ ట్రిప్ ''

''ట్రిప్! వాట్?''

''చరస్'' వెకిలిగా కన్ను కొట్టింది. ఇరవై రూపాయిలు ఇచ్చి రెండు సిగరెట్లు తీసుకున్నాడు. హిప్పీలు రామారావుకి బైబై చెప్పి వెళ్ళిపోయారు.

అశ్లీలాలు గుప్పించి బూతులు తిట్టిన అమ్మాయికి, కుష్టురోగిని చూసి పెల్లు బికిన జాలితో వికావికలై ఏడుస్తూ అస్సలు డబ్బుకే విలువ లేనట్లు వంద రూపాయలు ఇచ్చిన అదే అమ్మాయికీ – రెండు సిగరెట్లని ఇరవై రూపాయలకు అమ్మిన అదే అమ్మాయికీ ఎక్కడా పొంతనం కుదరటం లేదు. వీటన్నిటికీ మించి మెర్సీ కిల్లింగ్ మీద ఆ అమ్మాయి వెలిబుచ్చిన అభిప్రాయం, రామారావు మనస్సులో చీకటిలో ఆలోచనల ఊపుకి రెపరెపలాడుతున్న దీపశిఖలా కొట్టుకొంటోంది.. శాంత?!

రామారావు విశ్వేశ్వరుడ్ని, విశాలాక్షి, దేవాలయాన్ని, అన్నపూర్ణ మందిరాన్ని సందర్శించాడు. మట్టిపిడతలతో గంగోదకం తెచ్చి విశ్వేశ్వరుడ్ని అభిషేకించాడు – గుడి గంటని మోగించాడు.

వీభూది పెట్టుకున్నాడు. అడుగడుగునా మనస్సులో శాంతి కోసం వెతుక్కుంటున్నాడు.

శాంతతో పాటు తన మనశ్శాంతి కూడా పోయింది - శాంతని ఐహిక బాధనుండి విముక్తిరాలిని చేశాడు. శాంత భస్మావశేషాల్ని కూడా గంగానదీ పవిత్ర జలాల్లో ప్రక్షాళన చేసి ఆమె ఆత్మను శాంతింపజేశాడు - గాని - తను మాత్రం ఈ లోకంలో బందీగా మిగిలిపోయాడు - తోడులేని ఏకాకిలా జనారణ్యంలో అరుస్తున్నాడు.

బెనారస్ నగర వీధుల్లోనూ, రద్దీ బజార్లంటా, ఇరుకు గల్లీల్లోనూ, మురికి సందుల్లోనూ జెర్రిలా తిరిగిన చోటే తిరుగుతున్నాడు. ఆకలి వేస్తున్నట్లు అనిపించింది. ఆకలి కూడా వికారంగా ఉంది. దాహం తీర్చుకుందామని కిళ్ళీ దుకాణానికి వెళ్ళాడు.

అక్కడ షర్బత్తు కూడా అమ్ముతున్నారు. కొందరు ఆకుపచ్చ ముద్దని షర్బత్తులో కలుపుకొని తాగుతున్నారు. అదేమిటో అర్థంకాక ప్రశ్నార్థకంగా షాపువాడివైపు చూశాడు.

''డిస్కో డ్రింక్ - భంగ్'' అని కారాకిళ్ళీ పళ్ళతో నవ్వాడు.

అవును భంగు పుచ్చుకుంటే బాధలు మరచిపోవచ్చు! - ఒక గ్లాసుకి ఆర్డరు ఇచ్చి మరో రెండు గ్లాసులు చప్పరించుకు తాగాడు. చల్లగా హాయిగా అనిపించింది. తియ్యగానూ, పసరు వాసన ఘాటుతో ఒగరుగానూ, ఐసు షర్బత్తుతో హాయిగా గొంతుదిగి కడుపులో ఆకల్ని కూడా ఆవిరిలా ఇగర్చేసింది.

గంగవైపు నడకసాగించాడు. అప్పటికే చీకటిపడింది. నడకతోపాటు కడుపులో భంగుప్రభావం మెల్ల మెల్లగా కదులుతూ మత్తుగా నరాల్లోనించి పాకుకుంటూ, మనస్సులోను, మేధస్సులోను మెదిలే ఆలోచనా పొరల్ని అలలు అలలుగా తాకుతోంది. అవయవాలు మెల్లమెల్లగా పట్టుతప్పు తున్నాయి. గాలిలో తేలుతున్నట్లు గల్లీల్లోనుండి నడుస్తున్నాడు. వీధుల్లో విద్యుత్ దీపాలు, ఆకాశం మీద నక్షత్రాలు అన్నీ కలగా పులగంగా కళ్ళుముందు ఆడుతున్నాయి. పాత జ్ఞాపకాలు, శాంత చావు, కొన్ని వేల సంవత్సరాల వెనక్కో లేక పూర్వజన్మస్మృతుల్లాగో మనస్సులో సుదూరంగా ఎక్కడో చీకటి గుహల్లోకి వెళ్ళిపోతున్నట్లనిపిస్తోంది - నడుస్తున్నాడు - వడివడిగా అడుగులు వేయాలని ప్రయత్నిస్తున్నాడు - సందుల్లో ఇరువైపులా ఉన్న భవంతులు చూస్తుండగనే బ్రహ్మాండంగా ఎదిగిపోతూ తనని ఇరువైపులనుంచి అణచివేయాలని మరింత ముందుగా జరుగుతూ దారిని అడ్డగిస్తున్నట్లు భ్రమకలుగుతోంది. వాటిని తప్పించుకొని ఆ ఇరుకుల్లోనుంచి దూరుకుంటూ నడుస్తున్నట్లు ఒంగొని పక్కలకు జరుగుకుంటూ పాకుకుంటూ నడుస్తున్నాడు. ఒక్కొక్కసారి విశాలమైన ఎడారుల్లో నడుస్తున్నట్లనిపిస్తోంది. ఇళ్ళు, దుకాణాలు

చెట్లు, దీపాలు, చీకటి రామారావుని చూసి భయంగా దూరంగా పారిపోతున్నాయి. చిత్ర విచిత్రమైన మానసిక సంక్షోభం రామారావుని దహించేస్తోంది! అతనికి ముచ్చెమటలు పోస్తున్నాయి. తల బరువెక్కుతూ వాచిపోతోంది. ఎర్రబడిన కళ్ళ రానురాను బెదురుచూపులు సంతరించు కుంటున్నాయి. పులి తరుముతున్న లేడి పిల్లల చూపుల్లా పిరికిగా కనుపాపలు గజిబిజిగా కదులు తున్నాయి. తిరిగిన చోటే తిరుగుతూ, తిరిగి తిరిగి, తప్పిపోతూ ఎలాగైతేనేం గంగానదీ తీరానికి చేరుకున్నాడు. గట్టుమీద రావి చెట్టు క్రింద కూర్చున్నాడు స్నాన ఘట్టాలు ఇరువైపులా కనుచూపు మేర రామారావు మత్తుచూపుల్లో జోగుతున్నాయి.

అలా ఎంతసేపు కూర్చున్నాడో రామారావుకి తెలియదు. నిద్రలోంచి మెలకువలోకి, మెలుకువ లో నించి మత్తులోకి; ఊదులాడుతూ రావి చెట్టు మొదలికి ఆనుకున్నవాడు గజిబిజిగా గురకలు తీస్తూ అచేతనంగా చెట్టు మొదట జారిపోయాడు – అలా చాలాసేపు ఉన్నాడు. అర్ధరాత్రి దాటిపోయింది. చలితోపాటు గంగమీద చల్ల గాలులు వీస్తున్నాయి. పిండారబోసినట్లు వెన్నెల కాస్తోంది. స్నానఘట్టాలు ఇంచుమించు నిర్మానుష్యమైపోయాయి.

రామారావుకి మెలకువ వచ్చేసరికి పరిసరాలంతా నిశ్శబ్దంగా ఉన్నాయి. దూరంగా ఎక్కడ నుండో భజన వినిపిస్తోంది. రామారావు అతికష్టంమీద లేచాడు. తలలో వికారంగా ఉంది. ఒళ్ళంతా నొప్పిగా ఉంది. మెల్లగా మెట్లు దిగుతూ; చలిగా ఉన్నా ముఖం కడుక్కొని మత్తు వదిలించు కొందామని, స్నాన ఘట్టాల వైపు వెళ్తున్నాడు.

నిర్మానుష్యంగా ఉన్న దుకాణాల మీద ఆకుగొడుగులు గాలికి ఊగుతున్నాయి. రామారావుకి ఒక గొడుగు క్రింద నుంచి చప్పుడు వినిపించింది. గొడుగు కదులుతోంది. రామారావు చెవి నిక్కించి ఆలకించాడు. ఏవో పెనుగులాటలు, ఎగూర్పులు వినిపిస్తున్నాయి. ఒక అమ్మాయి కిచకిచ నవ్వుతోంది. పెనుగులాటల్లో తారాస్థాయి నందుకొంటూ, మత్తుగా, మదమెక్కిన కైపుతో వికావికలుగా నవ్వుతోంది. ఆకుగొడుగు ఊగిపోతోంది. అంతే – ఒక మగ గొంతు గావుకేక, గొడుగు ఎగిరితుళ్ళిపోయింది. గొడుగు క్రింది నుంచి లేచిన అమ్మాయి గౌను సర్దుకొంటూ లేచి విరగబడి నవ్వుతోంది.

మగవాడు కేకలు పెట్టుకుంటూ తొడల సందుల్ని చేత్తో పట్టుకొని దెబ్బతిన్న కుక్కలా వెన్నెల్లో అరుచుకుంటూ పరుగెత్తుతున్నాడు.

పాపం అమ్మాయి తన్నరానిచోట తన్నేసింది – మోటు సరసం.

''యూ క్రేజీ క్రీప్'' అని, నవ్వుకుంటూనే వెంబడించింది. అలా ఇద్దరూ నవ్వుకుంటూ అరుచుకుంటూ పొగమంచులో నీడల్లా కలిసిపోయారు.

అప్పుడు రామారావుకి గుర్తుకొచ్చింది. వాళ్ళు ప్రొద్దున్న తను చూసిన హిప్పీలని. ఆ అమ్మాయి అమ్మిన సిగరెట్టు జ్ఞాపకం వచ్చి సిగరెట్టు తీసి వెలిగించాడు. గుండెలనిండా పొగపీల్చి నెమ్మదిగా విడిచిపెడ్తున్నాడు. గంజాయి వాసన. ముక్కు మండుతోంది. అలానే సిగరెట్టు కాల్చుకుంటూ పొగని వెన్నెల్లోకి వదులుకుంటూ నడుస్తున్నాడు.

ఎక్కడో దూరాన సన్నని వాద్యం వినిపిస్తోంది. తంతులు మీటుతూ ఎవరో గిటారు వాయిస్తు న్నారు. ఛరస్ సిగరెట్లు మత్తుపొగని ఆస్వరతరంగాలు మరింతగా దోహదం చేస్తూ మెత్తని ఉత్తేజాన్ని రెచ్చగొడుతున్నాయి. ఆనంద పారవశ్యంతో కళ్ళు అర్ధనిమీలితంగా మూతలు పడు తున్నాయి. ఆకాశం మీద ఊగుతున్న చంద్రుడు; వెన్నెలలో తడిసిన పొగమంచు, తన శరీరాన్ని, దుఃఖాన్ని అంచెలంచెలుగా వెనక్కి విడిచి పెట్టేస్తున్నట్టు, కేవలం తన ఆత్మతో మాత్రం ముందుకు నడుస్తున్నట్లు సంగీతం వినిపిస్తున్నవైపు గాలిలో నడుస్తున్నట్లు, గురుత్వాకర్షణ శక్తినుంచి విడిపోతున్నట్లు స్లోమోషన్ పిక్చర్‌లాగ నడుస్తున్నాడు. సిగరెట్టు దమ్ముని మరింత జోరుగా కొడ్తున్నాడు.

రానురాను గిటార్ సంగీతం దగ్గరౌతోంది. మెలోడియస్‌గా ప్రవహిస్తోంది.

పాశ్చాత్యుడు... రాగిరంగు జుత్తు జులపాల్లా మెడమీద వేలాడుతోంది. ఇటుక రంగు గెడ్డం.

మెళ్లో రుద్రాక్షలు. కేవలం నిక్కరుతో ఉన్నాడు. ఎర్రటి శరీరం వెన్నెల్లో నున్నగా మెరుస్తోంది. మంచుతో తడిసిన జుత్తుమీద, గెడ్డం మీద, గుండెలమీదున్న వెంట్రుకలు మీద, చంద్రకాంతి పొడలు. పావంచాలమీద కూర్చొని నీళ్ళలో కాళ్ళు వేలాడేసుకున్నాడు. గిటార్ మీటుతున్నాడు దొర బైరాగి. ప్రక్కనే రామారావు కూర్చున్నా ఆ సంగతి కూడా గమనించకతనలో తానే చిరునవ్వు నవ్వుకుంటూ తను వాయిస్తున్న గిటార్ వాద్య తరంగాల ప్రకంపనలకి అప్పుడప్పుడు తలవిదిలించుకొంటూ శృంగార రసమయ సంగీతాన్ని తీగల మీద గీటుకుంటూ ఆస్వాదిస్తున్నాడు.

మనోజ్ఞ గంగాతీరం. విరబూసిన వెన్నెల. గిటార్ మంజుమంజుల తంత్రీనాదాలకి గొంతు కలుపుతూ పావంచాలకి లయబద్ధంగా తాకుతున్న పిల్ల తెమ్మరల సవ్వడి – రామారావుకి ఏదో లోకంలో విసిరేసినట్లుగా ఉంది. ఎటుచూసినా నేత్రానందకర దృశ్యాలే. శ్రవణానందకర సంగీతమే – రామారావు రెండో సిగరెట్టు తీసి వెలిగించాడు. పొగతాగుతూ కళ్ళు మూసుకొని వింటున్నాడు.

అలా వింటున్న వాడల్లా ఒక్కసారి ఉలిక్కిపడి లేచాడు.

హాయిగా పోతున్న బండికి సడన్ బ్రేక్ పడినట్లు జర్క్‌తో ఊగాడు.

గిటార్ బైరాగి ''మానవ జీవితం సుఖ దుఃఖాల మేలుకలయిక సుమా'' అని తాత్విక చింతనతో చెప్పినట్లు అంతవరకూ ఆనందంగా హాయిగా సాగుతున్న గిటార్ వాయిద్యాన్ని గేరుమార్చి విషాదవుటంచుల్లోకి మరల్చాడు. తంత్రుల మీద విషాదాన్ని మీటుతున్నాడు. తారా స్థాయిలో విషాద ప్రకంపనలు. రామారావు గుండెలు అదిరిపోతున్నాయి. వణుకుతున్న పెదాల్లో సిగరెట్టు పొగ ఇరుక్కొని ఉక్కిరిబిక్కిరై పోతున్నాడు. ఆపాద మస్తకం కంపించి పోతున్నాడు. మరి ఉండలేక గట్టిగా –

''స్టాపిట్!... యు స్టాపిట్ ఐసే!!'' అరిచాడు. విషాదాన్ని కూడా చిరునవ్వుతోనే ఏకాగ్రతతో మీటుతున్న వాద్యగాడికి రామారావు అరుపులు వినిపించటం లేదు.

రామారావు లేచి అక్కడనుంచి పరుగెత్తాడు – అంతా చీకటి కమ్మేస్తోంది. ఆ చీకటిలో – ఆ నిశ్శబ్ద నిశీథంలో నుంచి, అంతవరకు రామారావు మనస్సులో ఎక్కడో దాగున్న శాంత– శాంత శవం – శాంత కళ్ళు; ఒక్కసారి రోదసిలోంచి దూసుకు వచ్చినట్లు రామారావు ముందు సాక్షాత్కరించాయి.

''శాంతా!'' అని గట్టిగా అరిచాడు. సిగరెట్టు పడిపోయింది – ఏడుస్తున్నాడు. ఈ లోకంలో నేను బందీనైపోయాను. నేను ఏకాకిని.

అచేతనంగా ఉన్న శాంత కళ్ళు ఇంతై, ఇంతింతై, మరింతై భూమ్యాకాశాలను ఆవరించుకొంటున్నాయి.

''నువ్వు శాంతని చంపేశావ్ – మర్డరర్ – హంతకుడివి'' నిశ్శబ్దపు సవ్వడులేవో తలలో గింగురులెత్తి పోతున్నాయి.

వెంటాడుతూ మీద పడిపోతున్నాయి. కాలరు పట్టుకొని వేన్‌లో విసిరేశారు.

కిక్కిరిసిన కోర్టు మధ్యలో ''హంతకుడు – ఉరిశిక్ష'' ఉరికంబం మీద కాళ్ళ క్రింద ట్రాప్ డోర్ ధడాలున తెరుచుకొంది. చీకటి నూతిలో వేలాడుతున్న రామారావు ఉరితీసిన మృత కళేబరం.

''నేను హంతకుడ్ని కాదు. అవుట్ ఆఫ్ లవ్... బాధనుండి విముక్తిచేశాను'' – ఆ గావుకేకలు భూమ్యాకాశాన్ని చీల్చుకుంటూ ముల్లోకాల్ని వణికిస్తున్నాయి.

రామారావు నోటినుంచి ఏ ఒక్కమాటా బైటికి రావటంలేదు. ఆ అరుపులు అసలు విని పించటం లేదు. పెదవి కదలటం లేదు. ఆ మాటలు, భయం, అరుపులు తనలోనే కోట్లాది గొంతుక లతో ప్రతిధ్వనిస్తున్నాయి. తను అరుస్తున్నాననుకొంటున్నాడు. అరవటం లేదు. ఏడుస్తున్నానను కొంటున్నాడు. ఏడవటం లేదు. విచిత్రమైన మానసిక సంక్షోభం.

భంగుమత్తు దుఃఖ భారాన్ని మరింత కృంగదీస్తే, చరస్ దుఃఖాన్నీ విషాదాన్నీ దావానలంలా రెచ్చగొట్టేస్తుంది. వక్రీభవించిన మేధస్సు వికృతరూపం. పీక పిసికేసుకుందామను కుంటున్నాడు. ఎత్తయిన భవనం మీది నుంచి దూకి కడతేర్చుకుందామనుకుంటున్నాడు – గంగా ప్రవాహంలో కొట్టుకుపోయి సముద్రంలో కలిసిపోదామనుకుంటున్నాడు – ఏదీ చెయ్యలేక పోతూనే చేద్దామను కుంటున్నాడు –

హాల్యూసినేషన్స్ –

అలా ఆలోచిస్తూ, తిరుగుతూ, పరుగెత్తుతూ, అరుస్తూ, పిచ్చివాడిలా నవ్వుకొంటూ ఆ రాత్రి తెల్లార్లూ తిరిగి తిరిగి ఎటో వెళ్ళిపోయాడు.

★ ★ ★

విదేశీ పర్యాటకులు గంగానది మీద పడవ ప్రయాణం చేస్తున్నారు. విహారయాత్ర. తరతరాల నుంచి కాశీపట్నం పుణ్యస్థలమేకాకుండా పర్యాటకులకు విహారయాత్రా స్థలం కూడా. ప్రపంచం నలుమూలల నుంచీ వివిధ మతాల వాళ్ళు, జాతుల వాళ్ళు నిత్యం కాశీని సందర్శిస్తూనే ఉంటారు. ప్రాచీన భవంతులు, అధునాతన వసతి గృహాలు, దేవాలయాలు, మసీదులు, విశ్వేశ్వ రాలయం, హిందూ విశ్వ విద్యాలయం ప్రత్యేకాకర్షణలు. బెనారస్ పట్టు, రాగితోనూ, పంచ లోహాలతోనూ చేసిన రకరకాల అలంకార సామాగ్రి, రుద్రాక్షలకి పెట్టింది పేరు కాశీ – మరొక వైపు కంపు, కాలువలు, ఇరుకు సందులు, జన సమ్మర్దం ఆబోతుల స్వైరవిహారం, ఉచ్చులు, రోడ్డు మీద కిళ్ళీ ఉమ్ములు, ముష్టివాళ్ళు, నది ఒడ్డున శ్మశానాలు, నీళ్ళలో తేలియాడే జంతుకళేబరాలు. ఐశ్వర్య దారిద్ర్యాల సమ్మేళనమైన ఈ ప్రాచీన నగరం ఎప్పుడూ గంగలా నిండుగానే ఉంటుంది.

పడవలో విదేశీ అబ్బాయిలు, అమ్మాయిలూ ఉన్నారు. జీన్స్, స్కర్టులు తొడుక్కొనున్నారు. కొందరి కళ్ళకి గాగుల్స్ తగిలించుకున్నారు. మెడల్లో కెమేరాలు, బైనాకులర్స్ వేలాడు తున్నాయి. పడవ చివర్నదొరబైరాగి కూర్చుని గిటార్‌వాయిస్తున్నాడు. పడవవాడుతెడ్లు వేస్తున్నాడు. అలల ఎగుడు దిగుడుల మీదనుంచి పడవ ఊగుతోంది. ఆ ఊగులాటలో స్నాన ఘట్టాలు, ఘట్టాన్ని ఆనుకొని భారతీయ సంస్కృతికి ప్రతీకగా నిలిచిన పురాతన కట్టడాలు కూడా క్రిందికి మీదికి ఆడుతున్నట్లుగా ఉన్నాయి.

దశాశ్వమేధఘాట్, హరిశ్చంద్రఘాట్, మణికర్ణికాఘాట్, ఒక్కొక్క ఘాట్‌ని దాటుకొంటూ

పడవ నడుస్తోంది.

కుక్క కళేబరం అడ్డు పడింది - తెడ్డుతో దూరంగా తోసేశారు.

స్నానఘట్టాలు, భక్తజన సందోహం, వినీలాకాశపు నేపథ్యంలో బారులుతీరిన ప్రాచీన భవంతులు దూరమౌతున్నాయి. వ్యాసకాశీవైపు పడవ నడుస్తోంది.

రుద్రాక్షల దొరబైరాగి, ఆకాశం గంగానది మీదికి ఒరిగి ముద్దాడుతున్న ఊహా ప్రదేశాన్ని సుదూరంలో చూస్తూ పడవతోపాటు ఊగుతూ గిటార్ మీటుతున్నాడు. తంత్రీనాదాల మధ్య చిన్న కూని రాగాలు కూడా తీస్తున్నాడు.

దూరమౌతున్న కాశీనగరాన్ని సినీ కెమేరాలతో పడవలోనించి ఫిల్మ్ తీసుకున్నారు.

పడవలో దొరసాని కెవ్వున కేకపెట్టింది. అరుపులో భయంతో పాటు సంభ్రమాశ్చర్యాలు కూడా ఉన్నాయి.

పడవ క్రిందినుంచి మానవ కళేబరం లేచింది. నిటారుగా లేచి వెల్లకింతలా తిరగబడి తేలి పోయింది. నగ్నంగా ఉంది.

పడవవాడు తెడ్డుతో ప్రక్కకు తోశాడు - ఉబ్బిపోయుంది. చేపలు ముక్కులు చెవులు తినేశున్నాయి. కళ్ళు ఆకాశం వైపు చూస్తున్నాయి. పడవలో ఉన్నవాళ్ళంతా పడవని ఆపమని గజిబిజిగా తోసుకొంటూ శవాన్ని చూస్తున్నారు. కెమేరాలు జిగ్‌జిగ్‌మని ఫ్లాష్‌చేస్తున్నాయి. పోటీ పడి ఫోటోలు తీస్తున్నారు.

సినీ కెమెరా కిర్రుమంటూ రంగుల్లో అందంగా శవాన్ని ఫిల్మ్ చేస్తోంది.

కాకుల గుంపు కావుకావుమని అరుచుకుంటూ తిరుగుతోంది.

రుద్రాక్షబైరాగి బహుశా శవాన్ని చూసి కాబోలు విషాద గీతాన్ని బొంగురుగా పాడు కుంటూ గిటారు మీటుతున్నాడు. ఆ పాట గిటార తంత్రీ స్వరాలు ఎక్కడో కొండలోయల్లో నించి వచ్చి నట్లుగా దీనంగా నీటిమీద తేలియాడుతున్నట్లుగా ఉంది.

కెమేరాలతో తీస్తున్న శవ చిత్రీకరణ సన్నివేశానికి ఆ విషాద గీతం నేపథ్య సంగీతంలా ఉంది.

కాకి శవంమీద వాలి కళ్ళు పొడుచుకు తింటోంది. శవంతోపాటు తేలుతూ దూరమౌతోంది. కాకుల గుంపు అరుస్తూ వెంబడిస్తూనే ఉంది. రాను రాను అలా తేలుతూ దూరమౌతున్న శవాన్ని కనుమరుగయే వరకూ ఫోటోలు తీస్తూనే ఉన్నారు. బైనాక్యులర్స్‌లో నించి చూస్తున్నారు.

మృత కళేబరాన్ని అత్యంత ప్రతిభావంతంగా సెల్యులాయిడ్‌లో బంధించారు.

గంగానదిమీద జుగుప్సాకరంగా తేలియాడుతూ జరిగిన శవయాత్రకి తన గిటార్ ద్వారా విషాద సంగీతాన్ని అందించాడు బైరాగి.

ఇంతకీ ఆ అనాధ మృతకళేబరం వెనకగల అత్యంత విషాదగాధ, ఎవరికీ తెలియదు! పాపం రామారావు..........!!!

★

**(జ్యోతి మంత్లీ - 1989 ఉగాది ప్రత్యేక సంచిక)**

**(అంకితం:- మేధావి, నిగర్వి, నాకు మంచి మిత్రులు కీ..శే.. జ్యేష్ఠ గార్కి -)**